

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 24 మార్చి 2024



శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 36.5°C | కనిష్ఠం : 22.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	ఆదివారం	సా : 6.33 గం..
సహర్ :	సోమవారం	ఉ : 4.54 గం..

ఇంటర్వ్యూ

ఓటింగ్ శాతం పెంచుతాం..





- ప్రతీ ఒక్కరు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం
- చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం
- అందుబాటులో కంట్రోల్ రూమ్‌లు, 1950 టోల్ ఫ్రీ నెంబరు
- ఏప్రిల్ 15వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

మే నెలలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శనివారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎన్నికల గురించి పలు విషయాలను చర్చించారు. - ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

- కొన్నిచోట్ల నేడు.. మరికొన్ని ప్రాంతాల్లో రేపు..
- నేడు కామదహనం.. ఆలయాల్లో పౌర్ణమి హోమాలు, పూజలు
- రసాయన రంగులతో ప్రమాదమంటున్న పర్యావరణ వేత్తలు

ఆనందాల కేళి.. హోలీ..

రంగుల పండుగకు సర్వం సిద్ధం






రంగుల పండుగ వచ్చింది.. హోలీ వేడుకలు సంబురంగా జరుపుకునే వేళ ఆసన్నమైంది. కొన్నిచోట్ల ఆదివారం (నేడు), కొన్నిప్రాంతాల్లో సోమవారం (రేపు) హోలీని ఆడుకోవడానికి ప్రజలు సన్నద్ధమయ్యారు. ఈ పండుగ పురాణ ఇతిహాసాల్లోనూ చోటు సంపాదించుకుంది. తెలుగు మాసాల్లో చివరిదైన 'ఫాల్గుణ మాసం' అంటే శ్రీమహావిష్ణువుకు మహా ఇష్టమని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఈ మాసంలోనే స్వామికి ప్రీతిపాత్రమైన లక్ష్మీదేవి ఉద్భవించిందని, అందుకే లక్ష్మీనారాయణుల ఆరాధనకు ఈమాసం అన్ని విధాలా అనుకూలమని చెబుతారు. ఈ వేడుకని జరుపుకొనే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యానికి హానికలిగించే, రసాయనాలు కలిసిన రంగులను వాడొద్దని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే రంగులు పూసుకొని మద్యం సేవించి వాహనాలతో రోడ్లపై విచ్చలవిడిగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు కూడా సిద్ధమయ్యారు.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్ / వరంగల్ కల్చరల్

7

'పన్ను'లపై చిన్నచూపు



వరంగల్ కార్పొరేషన్, మార్చి 23: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పన్నుల వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. మార్చి 31 వరకు వార్షిక సంవత్సరం ముగుస్తుందని తెలిసి కూడా పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టిసారించడం లేదు. దీనిపై సంబంధిత అధికారులపై కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేయడంతో పన్నుల వసూళ్లకు పరుగులు తీస్తున్నారు.

వార్షిక సంవత్సరంలోపు..

కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఇళ్లు, షాపులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు, వివిధ రకాల వ్యాపార, వాణిజ్య కేంద్రాల నుంచి వార్షిక పన్ను వసూలు చేయాల్సి ఉంది. ప్రధానంగా ఇంటి పన్ను, నల్లా పన్ను, గార్బేజ్ (చెత్త) పన్నులతోపాటు ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీలను క్రమం తప్పకుండా యేడాదికోసారి ఎప్పుడైనా వసూలు చేయాలి. కానీ కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బల్దియాకు వచ్చే ఆదాయానికి గండిపడుతోంది.

- వసూళ్లలో బల్దియా సిబ్బంది ఉదాసీనత
- ఇప్పటివరకు 98 శాతానికి 60 శాతమే వసూలు
- లక్షల్లో పేరుకుపోయిన బడా వ్యాపారుల పన్నులు
- అధికారులపై కమిషనర్ సీరియస్
- వార్షిక సంవత్సరంలోపు లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశాలు

ఇప్పటి వరకు వసూలైందెంత?

2023-24 వార్షిక సంవత్సరానికి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం 95 శాతం అన్నిరకాల పన్నుల రూపంలో డబ్బులు వసూలు చేయాల్సి ఉంది. వార్షిక ఆదాయంలో రూ.97.66కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రూ.63.96కోట్లు మాత్రమే వసూలు చేశారు. అంటే 60 శాతమే పన్నులు సేకరించారు. అయితే అధికారుల తీరుపై ఈనెల 20న బల్దియా కార్యాలయంలో కొత్త కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇంకా పది రోజుల సమయంలో పూర్తి టార్గెట్ సాధించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో అధికారులు, సిబ్బంది పరుగులు పెడుతున్నారు.

ఇక ఆర్ఐలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కింది స్థాయి సిబ్బంది జవాన్లు, బిల్ కలెక్టర్లపై వీరి ప్రతాపాన్ని చూపిస్తున్నారు.

బడా సంస్థలపై..

గ్రేటర్ వరంగల్ పరిధిలో కొన్ని కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్ అపార్ట్‌మెంట్స్, హోటళ్లు, మార్ట్‌ల పన్నులపై అధికారులు అంతగా దృష్టిసారించడం లేదు. యాజమాన్యాలు ఇచ్చే నెలవారి మామూళ్లు, గిఫ్ట్‌లకు ఆశపడి కొందరు బల్దియా సూపర్‌వైజర్లు, ఆర్ఐలు, జవాన్‌లు పన్ను వసూళ్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు పేరుమోసిన వ్యక్తులు ఏళ్లతరబడి లక్షల్లో బకాయిలున్నా వారిని ముట్టుకోకుండా చిన్న వ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ నిర్వాహకులకు ఇప్పటివరకు పన్నులు చెల్లించాలని నోటీసులు జారీచేయకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన కల్పించని సిబ్బంది

పన్నుల వసూళ్లపై బల్దియా సిబ్బంది వాల్‌పోస్టర్లు, కళాకారుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించాల్సి ఉంది. కానీ అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ యేడు ప్రజలు చెల్లించాల్సిన పన్ను వడ్డీ (ఫైన్)పై 90 శాతం రాయితీ ఉంది. అది కూడా ప్రజల్లోకి ప్రచారం చేయకపోవడం వల్లనే చెల్లింపులలో కోత పడ్డట్టు తెలుస్తోంది. ఈ యేడాది ఏప్రిల్ 1 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయికి 25శాతం వడ్డీ జమ చేయనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ కార్యాలయంలో నుంచి ఆదేశాలు అందాయి.

గుట్టు రట్టు

- ఎంహెచ్ నగర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు
- దాడి చేసిన పోలీసులు.. డాక్టర్, నర్సుపై కేసు
- మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం

7

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 23: నిర్దీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పోతననగర్‌లో నిర్మిస్తున్న ల్యాండ్ మార్ట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. స్మార్ట్ సిటీ ప్రతినిధులు మార్ట్‌లో అమర్చిన మిషన్లు, వాటి పనితీరును కమిషనర్‌కు విశ్లేషించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ల్యాండ్రో మార్ట్‌ను బీసీ వెల్ఫేర్ వారికి నిర్వహణ కోసం అప్పగిస్తామని వెల్లడించారు. అనంతరం భద్రకాళి బండ్ ను సందర్శించారు. వరదలు వచ్చిన సమయంలో తెగిన కట్ట ప్రాంతాన్ని సందర్శించి అడిగి తెలుసుకున్నారు. కట్ట తెగిన ప్రాంతంలో వ్యాల్వులు నిర్మించాలని అధికారులకు సూచించారు. కట్ట ప్రాంతంలో సుందరీకరణ అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆరెపల్లి సమీపంలోని గ్రాండ్ ఎంట్రన్స్ విస్తరణ పనులను పరిశీలించారు. స్టామ్ వాటర్ పనుల గురించి పూర్తి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ సంజయ్‌కుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఓలేటి ఆనంద్, డీఈలు పాల్గొన్నారు.

'పది' గణితం పరీక్ష ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 23: పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. శనివారం జరిగిన పరీక్షలో వరంగల్ జిల్లాలో 99.86శాతం మంది విద్యార్థులు హాజరుకాగా, హనుమకొండ జిల్లాలో 99.88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్ జిల్లాలో 9,455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 9,442 మంది హాజరుకాగా 13 మంది గైర్హాజరయ్యారు. ఇక హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 12,032 మంది హాజరు కావాల్సి ఉండగా, 12,018 మంది హాజరుకాగా14మంది గైర్హాజరయ్యారు. వరంగల్ జిల్లాలోని వరంగల్ పట్టణంలోని కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల, ఎల్బీనగర్‌లోని లెర్నర్స్‌ల్యాండ్ స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన వసతులను ఆమె నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా పరిధిలోని రెండు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించగా, అదనపు కలెక్టర్ రెండు కేంద్రాలను, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై 11 కేంద్రాలను సందర్శించారు. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 24 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

పోలీసుల్లో ట్యాపింగ్ టెన్షన్!

- వ్యవహారంలో వెలుగులోకి ఒక్కొక్కరి పేర్లు
- వరంగల్ ఖాకీలను వణికిస్తున్న లింకులు
- ప్రణీత్‌తో పాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పేరూ తెరపైకి
- భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావుకూ భాగస్వామ్యం
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఇద్దరు సీఐల ప్రమేయం, పర్వతగిరి వార్ రూమ్‌పై ఆరా



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసు వరంగల్ పోలీసులను ఓ కుదుపు కుదుపుతోంది. ఈ వ్యవహారంలో లింకులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండగా.. నాటి అధికారపక్షం అండతో.. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లో విచారిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు పోలీసుల అధికారుల పేర్లు తెరపైకి వస్తుండగా, పర్వతగిరి వార్‌రూమ్‌పై విచారణ చేస్తే మరికొందరు పోలీసుల ప్రమేయం కూడా బయటకు వస్తుందన్న అభిప్రాయాల మధ్య పోలీసుల్లో టెన్షన్ కనిపిస్తోంది.

కొందరు వరంగల్ పోలీసులే కీలకం

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రణీత్‌రావుది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి కాగా, ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న టి.ప్రభాకర్‌రావు కూడా కీలక పాత్రధారియేనని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో గుర్తించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న ప్రభాకర్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ప్రభాకర్‌రావుది హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం కాగా 2020జూన్ 30న పదవీవిరమణ చేశారు. అయితే అప్పటి సీఎం కేసీఆర్‌తో ఉన్న సత్సంబంధాలతో ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. పై అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేసినట్లు ప్రణీత్‌రావు పోలీసుల విచారణలో పేర్కొనటంతో ప్రభాకర్‌రావు ఇంట్లో తనిఖీలు చేపట్టడం వరంగల్ పోలీసుల్లో చర్చనీయాంశమైంది. ఇదే చర్చ జరుగుతున్న క్రమంలో భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావు సైతం ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వామ్యమయ్యారని దర్యాప్తు బృందం గుర్తించటంతో పాటు ఆయన అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఐదు నెలల క్రితమే భుజంగరావు భూపాలపల్లికి బదిలీపై రాగా.. వచ్చినప్పటి నుంచే ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రారంభం కావటంతో భూపాలపల్లి కంటే ఎక్కువ సమయం హైదరాబాద్‌కే పరిమితమైనట్లు సమాచారం. అలాగే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో భాగంగా వరంగల్ జిల్లా పర్వతగిరిలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. ప్రణీత్‌రావు తన బంధువుల ఇంట్లో ఈ వార్‌రూమ్ ఏర్పాటు చేసి కొందరి సహకారంతో ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఇదే కోణంలో దర్యాప్తు బృందం విచారించి రికార్డు చేసినట్లు తెలుస్తోంది. వరంగల్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐలు ప్రమేయం ఉందని, వారిని అదపులోకి తీసుకున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ప్రణీత్‌రావును శనివారం వరకే పోలీసు కస్టడికి కోర్టు అనుమతిచ్చింది. ఈ తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని సేకరించిన దర్యాప్తు బృందం మంగళవారం నుంచి రెండో విడత విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విడతలో పర్వతగిరి వార్‌రూమ్‌కు సహకరించిన ఖాకీల వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతుండగా.. ఫోన్‌ట్యాపింగ్ లింకులు ఎవరెవరికి ఉన్నాయోనన్న ఉత్కంఠ మరింత పెరుగుతోంది.

మిల్లర్లపై కొరడా..

వరంగల్ కలెక్టరేట్, మార్చి 23: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా జిల్లాలోని నాలుగు మిల్లులు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవడంతో జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి శనివారం తెలిపారు. 2022-23 వానాకాలంలో 1,79,922.170 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు సీఎంఆర్ డెలవరీ కోసం పంపించడం జరిగింది. ఎఫ్‌సీఐ, సీఎస్‌సీ రైస్‌మిల్లర్లు 1,21,017.886 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇందులో 98శాతం పూర్తి చేయగా, నాలుగు మిల్లులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డిఫాల్టర్లుగా పరిగణించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సంగెం మండలం పల్లార్‌గూడలోని శ్రీమహాలక్ష్మీ బిన్నీ రైస్ మిల్ యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, నర్సంపేటలోని శ్రీ వీరభద్ర మోడ్రన్ రైస్‌మిల్ యజమానిపై రెండు మూడు రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గీసుగొండ మండలం గొర్రెకుంట జయ ఇండస్ట్రీస్, చెన్నారావుపేట మండలం అక్కల్చేడులోని లక్ష్మీ గణపతి రైస్‌మిల్లులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి పేర్కొన్నారు.

ఆనందాల కేళి.. హోలీ..

రంగుల పండుగకు సర్వం సిద్ధం ● నేడు కామదహనం, ఆలయాల్లో పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/వరంగల్ కల్చరల్, మార్చి 23: హోలీ పూర్ణిమ పండుగను జరుపుకొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు సిద్ధమయ్యారు. సోమవారం హోలీ పండుగ నేపథ్యంలో ఆదివారం కాముని పున్నం సందర్భంగా కామ దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పురాణాల కాలం నుంచి వర్గ బేధాలకు తావులేకుండా స్నేహభావాన్ని పెంపొందించే వేడుకగా ఫాల్గుణ మాసంలో జరుపుకొనే ఈ పండుగ. ఫాల్గుణ పౌర్ణమి అంటే ఒక విశిష్టతతో కూడిన పండుగ. పౌర్ణమి తోడు కావడంతో ఆ రోజున ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు, వ్రతాలను ఆచరిస్తారు. చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారికి వసంతోత్సవ వేడుకను నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇతర దేవాలయాల్లో కూడా పౌర్ణమి పూజలు, ప్రసాద వితరణలు ఏర్పాటు చేశారు. అలాగే హోలీ పండుగ రోజున దేవుడి ఆశీర్వాదంగా మూడేళ్లలోపు చిన్నారులకు బిస్కెట్లతో తయారు చేసిన దండలను మెడలో వేస్తారు. తెలంగాణ ప్రాంతంలో హోలీ పండుగలో ఇది సంప్రదాయంగా వస్తోంది.

రెండు రోజులు వేడుకలు

హోలీ పండుగ ఏరోజు జరుపుకోవాలన్న విషయంలో ప్రతీ సారిలాగే ఈసారి కూడా కొంత అయోమయం నెలకొంది. ఈ ఏడాది పౌర్ణమి ఆదివారం, సోమవారం రెండు రోజులు ఉండగా కొందరు ఆదివారమే ఈ పండుగ జరుపుకోనుండగా మరికొన్ని చోట్ల సోమవారం హోలీ జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

కామదహనం ఎందుకంటే..

ఫాల్గుణ శుద్ధ చతుర్థి రోజున 'కామదహనం', ఫాల్గుణ పౌర్ణమినాడు కాముని పున్నమి పేరిట సంబరాలు జరుగుతాయి. లోకకల్యాణం కోసం పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించాలని దేవతలు నిర్ణయిస్తారు. పార్వతిదేవిపై పరమశివుడి దృష్టి నిలిచేలా చేయమని మన్మథుడిని కోరుతారు. అలవాటు ప్రకారం శివుడిపైకే మన్మథుడు బాణాన్ని ప్రయోగించి, ఆయనకు తపోభంగం చేస్తాడు. ఆగ్రహావేశాలకు లోనైన శివుడు మూడో కన్ను తెరిచి మన్మథున్ని భస్మం చేస్తాడు. అలా కోరికలు దహింపజేసిన రోజు కావడం వల్ల ఆ రోజు 'కామదహనం' పేరుతో మన్మథుడి బొమ్మను గడ్డితో చేసి తగుల బెడతారు

పురాణాల్లో ఇలా..

పురాణాల్లో హోలీ పండుగకు వెనుక ఓ కథ ప్రచారంలో ఉంది. రాక్షసులకు రాజైన హిరణ్యకశవుడు సుదీర్ఘ కాలం తపస్సు చేసి పగలు, రాత్రి, ఇంటా, బయట, భూమిపై, ఆకాశంలో, మనుషులు, జంతువులు, అస్త్రాలు, శస్త్రాలతో చావులేని వరాన్ని బ్రహ్మదేవుడిచే పొందుతాడు. ఆ అహంకారంతో స్వర్గం, భూమిపై దాడిచేసి ప్రజలంతా దేవుళ్లను ఆరాధించడం మానేసి తననే పూజించాలని ఆజ్ఞాపిస్తాడు. తన కుమారుడైన ప్రహ్లాదుడు విష్ణుమూర్తి భక్తుడు కావడంతో అతన్ని కూడా చంపించేందుకు అనేక ప్రయత్నాలు చేసి విఫలమవుతాడు. ఆ క్రమంలో హిరణ్యకశపుడి సోదరి హోళిక ఒడిలో చితిలో కూర్చోవాలని ప్రహ్లాదున్ని ఆజ్ఞాపిస్తాడు. మంటల నుంచి రక్షించే శాలువా ఆమె ధరించి ఉండడం వల్ల ఎలాంటి హానీ ఆమెకు మాత్రం జరగదని హిరణ్యకశపుడి నమ్మకం. తండ్రిమాట ప్రకారం హోళిక ఒడిలో కూర్చుని చితిలోకి వెళ్లడానికి అంగీకరించిన ప్రహ్లాదుడు తనను రక్షించాలని విష్ణుమూర్తిని వేడుకుం టాడు. ఆమె చితిలో కూర్చోగానే హోళిక శాలువా ఎగిరిపోయి ప్రహ్లాదున్ని కప్పుతుంది. హోళిక అందరి ముందే మంటల్లో కాలిపోతుంది. రాక్షసి అయిన హోళిక దహనం సందర్భంగా ఈ 'హోళీ' పండుగ జరుపుకుంటున్నట్లు విశ్వసిస్తారు.

కృత్రిమ రంగులతో ప్రమాదం

హోలీకి వినియోగించే రంగుల్లో వివిధ రసాయనాలు ఉండి చర్మవ్యాధులు, రోగాలను కలిగిస్తాయి. సహజసిద్ధంగా లభించే వనరులతో హోలీ పండుగను జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రసాయనాలకు సంబంధించి పారిశ్రామికంగా తయారైన కృత్రిమ రంగులవల్ల కలిగే దుష్ప్రభావాలు తెలుసుకుని ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పదార్థాల నుంచి సురక్షితమైన రంగులను ఏ విధంగా చేయవచ్చో తెలుసుకుని ఆ రంగులనే ఉపయోగించుకుంటే ఇటు ఆరోగ్యానికి, అటు పర్యావరణానికి మేలు జరుగుతుంది. రసాయన రంగుల్లో నలుపు లెడ్ ఆక్సైడ్ ద్వారా కిడ్నీ పాడైపోయే ప్రమాదముంది. ఆకుపచ్చ కాపర్ సల్ఫేట్ ద్వారా కళ్ల దురద రావచ్చు, తాత్కాలికంగా చూపుపోవచ్చు. సిల్వర్ అల్యూమినియం బ్రోమైడ్‌తో క్యాన్సర్‌కు దారితీసే లక్షణం చోటు చేసుకుంటాయి. నీలం పర్షియన్ బ్లూతో చర్మసంబంధ వ్యాధి, ఎరుపు మెర్క్యూరీ సల్ఫేట్‌తో చర్మక్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.


సహజ రంగుల తయారీకి ఉపయోగించే మోదుగు పూలు (ఫైల్)

సహజరంగు తయారీ

మోదుగుపువ్వు ప్రస్తుత వేసవి కాలంలో చాలా ప్రాంతాల్లో లభ్యమవుతుంది. దీనిని వేడినీళ్లలో ఉడికిస్తే ఎరుపురంగు వస్తుంది. దీనిని హోళీ రంగుగా ఉపయోగించవచ్చు. దీంతో ఏ విధమైన ఇబ్బందీ ఉండదు. వావిలాకు, జామాయిల్ ఆకులను ఉడికిస్తే ఎరుపు, పసుపు రంగులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి కూడా మంచివి. బీట్‌రూట్‌ను ముక్కలుగా తరిగి నీళ్లలో వేస్తే ఎరుపు రంగు నీరు లభ్యమవుతుంది. గులాబీ రేకులు నానబెట్టి కూడా రంగులు పొందవచ్చు.



వరంగల్ నగరంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు చల్లుకునే బొమ్మ పైపులు, రంగులు

ఓటింగ్ శాతం పెంపునకు కృషి

వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు ఏర్పాట్లు చేస్తున్నామని, ఫలితంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టంచేశారు. ఇక ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు, ఓటరుకు సహాయంగా ఉండేందుకు ప్రత్యేకంగా యాప్‌లను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని, అలాగే 24గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్‌రూమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం అనుసరిస్తున్న ప్రణాళి గురించి ఆమె శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: వరంగల్ లోక్‌సభ ఎన్నికల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

కలెక్టర్ : మే 13న జరిగే పోలింగ్ నిర్వహణతో పాటు ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిసి మొత్తం 18,16,500మంది ఓటర్లు ఉండగా, 1,899 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. వీటిలో 419 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు గుర్తించాం. ఎన్నికల నిర్వహణ కోసం 10వేల మంది సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. 130శాతం ఈవీఎంలు, వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అన్ని ఈవీఎంల పనితీరును పరిశీలించాం. ఎక్కడా ఈవీఎంలు మొరాయించకుండా చర్యలు చేపట్టాం. పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఓటింగ్ శాతం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలు గురించి?

కలెక్టర్ : ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గత లోక్‌సభ ఎన్నికల్లో 63.7శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఆ పోలింగ్‌శాతాన్ని పెంచడంపైనే దృష్టి పెట్టాం. ఇప్పటికే పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు సంకల్ప్ పత్రాలు అందిస్తున్నాం. 340క్యాంపస్ అంబాసిడర్లు, ఓటర్ అవేర్నస్ ఫోరంలను ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల కంటే వరంగల్ మహానగరంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోంది. కానీ ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. మెప్మా సహకారంతో మహిళాసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఓటర్లు పోలింగ్‌కు వచ్చేలా అవగాహణ కల్పిస్తున్నాం. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలోనే 10 నక్సల్స్ సమస్యాత్మక కేంద్రాలు, నాలుగు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిపించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ఫిర్యాదులు, సహాయానికి సంబంధించి..?

కలెక్టర్ : ఓటర్లకు 24గంటలపాటు అందుబాటులో ఉండేలా వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. టోల్ ఫ్రీ నెంబరు 1950కి కాల్‌చేసి కూడా ఫిర్యాదులు చేయవచ్చు, సహాయం కూడా పొందవచ్చు. అలాగే సి-విజిల్ యాప్ ద్వారా కూడా ఎన్నికల సంబంధించిన ఫిర్యాదులు చేయొచ్చు. ఈ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రాజకీయ పార్టీల కోసం సువిధ యాప్ అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా ఎన్నికల ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఓటర్ల కోసం ఓటరు హెల్ప్ లైన్ యాప్ కూడా అందుబాటులో ఉంది.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీ అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : వరంగల్ లోక్‌సభ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ తోపాటు అకౌంట్స్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం చేశాం. అలాగే పోలీసుశాఖతో కలిసి కీలకమైన ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నియమావళిపై ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించాం. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, వాల్ రైటింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్స్ తొలిగిస్తున్నాం. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలి.

ఆంధ్రజ్యోతి : ఓటరు నమోదుకు ఇంకా సమయం ఉందా..?

కలెక్టర్ : అవును ఇంకా సమయం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదవ్వొచ్చు. గతంలో జనవరి 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉంది. కానీ ఈసారి ఏప్రిల్ 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారు అర్హులవుతారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరు నమోదుకు గడువున్న నేపథ్యంలో అవకాశాన్ని వినియోగించుకోవాలి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి కూడా ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే ఫాం- 18 ద్వారా చేర్పులు, మార్పులు చేసుకునే వారికి మార్చి 25వ తేదీ వరకు గడువుంది.

ఎంహెచ్ నగర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు

దాడి చేసిన పోలీసులు.. డాక్టర్, నర్సుపై కేసు

మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కానింగ్ మిషన్

వరంగల్ మెడికల్, మార్చి 23: వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో ఓ స్కానింగ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేసినట్లు తెలిసింది. ఈ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం ఓ మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో కానిస్టేబుల్ మఫ్టీలో వెళ్లినట్లు సమాచారం. మొత్తం స్కానింగ్ సెంటర్‌లో ఆ సమయంలో ముగ్గురు గర్భిణులు ఉన్నట్లు తెలిసింది. అనంతరం అక్కడ గర్భ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చాక మఫ్టీలో ఉన్న పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం చేసుకోవడంతోపాటు వైద్యురాలు, నర్సును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈలోగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి సమాచారం చేరవేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ధ్రువీకరించేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో కూడిన ఒక బృందాన్ని అక్కడికి పంపారు. ఈ బృందం కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లు ధ్రువీకరించారని విశ్వసనీయ సమాచారం. కాగా, ఈ స్కానింగ్ సెంటర్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాలరావు ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైద్యురాలు డాక్టర్ సబిత, నర్సు మాధవిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు.

శ్యామలచంద్రకు డాక్టరేట్

కేయూ క్యాంపస్, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు రొక్కల శ్యామలచంద్రకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు శ్యామల చంద్రకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు శనివారం ఓయూ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 'ఆ కంప్రెహెన్సివ్ స్టడీ ఆన్‌ద సింథసిస్ ఆఫ్ గమ్ కారయ బయో కంపోసిట్ సిల్వర్ నానోపార్టీకలస్ అండ్ ఇట్స్ బయోలాజికల్ అప్లికేషన్స్' అనే అంశంపై ఓయూ బయో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కరుణ. రూపుల పర్యవేక్షణలో శ్యామల చంద్ర డాక్టరేట్ పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన శ్యామల చంద్రను పలువురు అభినందించారు.

మెడికల్ షాపు లైసెన్స్ సస్పెన్షన్

వరంగల్ మెడికల్, మార్చి 23: డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ రూల్స్ అతిక్రమించినందుకు కాజీపేట బాపూజీ నగర్‌లోని మెడ్ ప్లస్ లైసెన్సును ఏడు రోజులపాటు సస్పెన్షన్ చేసినట్లు హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె..కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఒక ఔషధం అమ్మకంపై ఇన్ఫర్మేషన్ కొనుగోలు బిల్లు, సేల్స్ రిజిస్టర్ వివరాల కోసం ఔషధ నియంత్రణశాఖ నోటీసులు జారీ చేసింది. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ రూల్స్ చట్ట ప్రకారం ఏడురోజులు లైసెన్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

సంగెం, మార్చి 23: తిమ్మాపురం హవేలి గ్రామంలో శనివారం హనుమకొండ మాధవ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ ఎండకాలంలో పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ సాయిలక్ష్మీ, జూనియర్ వైద్యులు ఎండీ యాకుబ్ పాషా, భిక్షపతి, దశరథ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ఓటరుగా నమోదు చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 23: జిల్లాలో 18 ఏళ్ల నిండిన ప్రతీ విద్యార్థి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం వరంగల్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శోభారాణి అధ్యక్షతన స్వీప్-24పై అవగాహన కల్పించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... ఓటు ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చునన్నారు. 2024 ఏప్రిల్ 1లోగా 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకొని ఎపిక్ కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఓటు వేడయమే కాకుండా కుటుంబంలో ఓటర్లందరిని ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్ గౌడ్, అధ్యాపకురాళ్లు మాలతి, కృష్ణవేణి, అనురాధ, విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు
ఆకుల సదానందం

వరంగల్ కల్చరల్, మార్చి 23: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తడకమల్ల రాంచందర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సెమినార్ హాల్‌లో సమాఖ్య సర్వసభ్య సమావేశంలో 200మంది సభ్యులు హాజరై కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఆకుల సదానందం(వరంగల్), ఉపాధ్యక్షుడిగా కాజీపేట తిరుమలయ్య(వరంగల్), కార్యవర్గ సభ్యులుగా గూడూరి బాలాజీ(వరంగల్)లకు స్థానం లభించిందన్నారు.

సమస్యల వలయంలో ఆర్టీఏ

• కార్యాలయంలో కానరాని మౌలిక వసతులు • మరుగుదొడ్లు, తాగునీటి వసతి శూన్యం..
• పేరుకుపోయిన తప్పుపట్టిన వాహనాలు • పట్టించుకోని అధికారులు, సిబ్బంది • అవస్థలు పడుతున్న వాహనదారులు

ఖిలావరంగల్, మార్చి 23: జిల్లా రవాణా కార్యాలయంలో నూతనంగా సరైన సౌకర్యాలు లేక వివిధ నిమిత్తం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలను కొనుగోలు చేసిన వాహనదారులు టెంపరరీ(ఎల్ఎల్ఆర్)లైసెన్స్, పర్మినెంట్ (డీఎల్) లైసెన్స్, లైసెన్స్‌లు, రెన్యూవల్స్ పొందెందుకు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుల నమోదు, ఫొటో, ఐరిస్, వేలిముద్రలు చేయడానికి వివిధ మండలాల నుంచి వాహన దారులు వస్తుంటారు. వారికి సరైన సమాచారం, హెల్ప్ డెస్క్, రాసుకోవడానికి కనీసం బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు, మలమూత్ర విసర్జన తదితర మౌలికవసతులు లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రంగశాయిపేట శివారు నాయుడుపెట్రోల్‌పంపు ప్రాంతంలో 31 అక్టోబరు 2008లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రోడ్డు రవాణా శాఖామంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మంత్రులు జువ్వాడి రత్నాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, డీఎస్ రెడ్యానాయక్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే బస్వరాజ్ సారయ్య తదితరుల ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. గతంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట, నర్సంపేట, తొర్రూర్, వర్ధన్నపేట, మహబూబాబాద్, ములుగు, ఏటూర్‌నాగారం, సిరిసిల్లా, కొత్తగూడెం, తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది వచ్చి వాహనాల రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేవారు. 2014లో తెలంగాణ ఏర్పాటు అనంతరం 2016 నుంచి రంగశాయిపేటలోని కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా, వరంగల్ జిల్లాలకు వాహనాల రిజిస్ట్రేషన్ కార్యాలయంగా వినియోగించారు. రెండేళ్ల క్రితం హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లాకు తరలించారు. ప్రస్తుతం రంగశాయిపేట నాయుడుపంపు వద్ద గల కార్యాలయంలో వరంగల్ జిల్లా రవాణా కార్యాలయం పనిచేస్తోంది.



మూసి ఉన్న మూత్రశాలలు



తుప్పుపట్టి పాడైపోయిన వాహనాలు



కార్యాలయంలో బారులుతీరిన వాహనదారులు

వరంగల్ జిల్లా రవాణా కార్యాలయానికి జిల్లాలోని సుమారు 13 మండలాలకు చెందిన ప్రజలు నూతనంగా కొనుగోలు చేసిన బైక్‌లు, ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్‌లు, డీసీఎం, లారీలు, స్కూల్ బస్సులు, వివిధ వాహనాలను రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. వరంగల్ జిల్లా రవాణా కార్యాలయంలో టెంపరరీ, పర్మినెంట్ లైసెన్సులు, రెన్యూవల్స్ తదితర రోజుకు వంద వరకు పైగా ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకొని తేదీ ప్రకారం వస్తుంటారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి:

వరంగల్ జిల్లా వ్యాప్తంగా బైక్, కార్లు, ఆటోలు, ట్రాలీలు, డీసీఎం, లారీ తదితర వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వాహనదారులకు జిల్లా రవాణా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు కోరుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు, మహిళలు కూర్చోవడానికి బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలంటున్నారు. ఆటో, ట్రాక్టర్, లారీలకు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో వారికి విషయ పరిజ్ఞానం, సరైన అవగాహన లేక టెంపరరీ(ఎల్ఎల్ఆర్) లైసెన్సు, పర్మినెంట్(డీఎల్) లైసెన్స్, రెన్యూవల్ తదితర పనులలో జాప్యం జరుగుతుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.



వరంగల్ జిల్లా రవాణా కార్యాలయం

బూత్‌బంగ్లాగా కార్యాలయం

సుమారు 16 సంవత్సరాల క్రితం రంగశాయిపేటలో నిర్మించిన వరంగల్ జిల్లా రవాణా కార్యాలయం బూత్ బంగ్లాగా మారింది. రవాణా కార్యాలయంలో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం, పిచ్చి మొక్కలతో ఇరుకుగా మారింది. ఆర్టీవో కార్యాలయం ఆవరణలో వాహనాల పత్రాలు సక్రమంగా లేని వాహనాలు, ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్‌లు, లారీలు, వివిధ కారణాలతో పట్టుబడిన వాహనాలు, తుప్పుపట్టి వాటి విడిభాగాలు అనేకంగా దర్శనమిస్తున్నాయి. దీంతో లోనికి వెళ్లే మార్గంలేక వాహనదారులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రవాణాశాఖ, సంబంధిత తెలంగాణ రాష్ట్ర జిల్లా అధికారులు జిల్లా రవాణా కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనదారులకు మౌలిక వసతులను కల్పించాలని కోరుతున్నారు.



ఖిలావరంగల్‌లో నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



రంగశాయిపేటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి



ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నివాళి

ఖిలావరంగల్,మార్చి 23: దేశంలో మోదీ ప్రభుత్వం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని, పౌరసత్వ సవరణ చట్టం అమలుకు వ్యతిరేకంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెళ్లి కృష్ణ డిమాండ్ చేశాడు. శనివారం ఖిలావరంగల్ చెమన్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద భారత స్వతంత్ర సంగ్రామ పోరాట భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని రాచర్ల బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకుందన్నారు. దీంతో దేశంలో ముస్లిం ప్రజానీకంపై దాడులు జరిగే ప్రమాదముందన్నారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లోకి పంపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మానవహక్కుల వేదిక నాయకుడు బండి కోటేశ్వర్‌రావు, గద్దర్ ఆలోచన వేదిక నాయకులు సుద్దాల నాగరాజు, నలిగంటి విజయ పాల్, అయిత ప్రవీణ్, పాల్గొన్నారు.

● భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్య దర్శి మేకల రవి అన్నారు. తమ్మెరభవన్‌లో సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గన్నారపు రమేష్, గుండె బద్రీ, సంగీ ఏలేందర్, ల్యాదళ్ల శరత్, మస్క సుధీర్, జన్ను రవి, రాజేందర్, యాకూబ్, యాకంబ్రాచారి, జన్ను శంకర్, ఆరోగ్యం, అనిల్ పాల్గొన్నారు.

● గిర్మాజీపేట : భారత స్వాతంత్ర్య విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఎంసీపీఐ(యూ), సంయుక్త కిసాన్ మోర్చాలు నివాళులర్పించాయి. అండర్‌బ్రిడ్జి సమీపంలోని జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎన్.హంసారెడ్డిలు నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు మంద రవి, నాయకులు నర్ర ప్రతాప్, రాజిరెడ్డి,నాగార్జున, మాస్ సావిత్రి, నగేష్, రాజు, కొంరమయ్య పాల్గొన్నారు.

● సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్లో సేవ్ డెమోక్రసీ డే గా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాచర్ల బాలరాజు, గోనే కుమారస్వామి, సోమడి శ్రీనివాస్, ఎస్.భాస్కర్,రాజయ్య నివాళులర్పించారు.

● పోచమ్మమైదాన్: పోచమ్మమైదాన్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీం నవీద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంజయ్, బానోతు మోహన్, సతీష్, కుమార్, రాజు, రంజిత్, సోహెల్, సౌజన్య, ప్రియాంక పాల్గొన్నారు. అలాగే దేశాయిపేటలోని సీకేఎం కళాశాల రోడ్డులో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐవైఎఫ్ కార్యదర్శి మస్క సుధీర్, శివ, రాకేష్, పాల్గొన్నారు.

● కరీమాబాద్ : రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఎం.రెడ్డప్ప, రహీమోద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, రుద్రాణి, వాల్య నాయక్ పాల్గొన్నారు.

● గీసుగొండ: మండలంలోని మనుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు, సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, నాయకులు పవన్, రాము, దిలీప్, రాజారాం, రాజమొగిలి, ఓదేలు పాల్గొన్నారు.

బ్లాక్‌మేయిలింగ్ రాజకీయాలు సాగవు: రేవూరి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 23: తనకు క్యాడరే ముఖ్యమని, బ్లాక్‌మేయిలింగ్ రాజకీయాలు సాగవని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. సంగెం మండల, 17వ డివిజన్ గ్రామాల గ్రామ, బూత్ స్థాయి నాయకులతో సమావేశం మరియపురం క్రాస్‌రోడ్డు వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అందరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీలో గ్రూప్, బ్లాక్‌మేయిల్ రాజకీయాలు చేస్తే వారిపై కఠిన వైఖరి ఉంటుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పడ్డ కష్టాలు తెలుసన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, తీగెల రాజేష్, అనిల్ పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లా కోసం కృషి చేయాలి



వరల్డ్ టీబీ డే థీమ్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, మార్చి 23: క్షయ (టీబీ) రహిత జిల్లా కోసం సమిష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని వరల్డ్ టీబీ డే థీం' ఎస్, వి కెన్ ఎండ్ టీబీ' పై సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వరల్డ్ టీబీ డే థీమ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుందర్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు పాటుపడాలి

పోచమ్మమైదాన్, మార్చి 23: ఎయిడ్స్ వ్యాధి యువత అవగాహన కలిగి, ఆ మహమ్మారి నియంత్రణకు యువత పాటుపడాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అన్నారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో శనివారం నెహ్రూ యువకేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అన్వేష్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ధార్మరెడ్డి, లైబ్రేరియన్ అనిల్‌కుమార్, రవీందర్, ధర్మయ్య, గంగయ్య, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అన్వేష్

కోటను తిలకించిన వియత్నాం దేశస్థులు

ఖిలావరంగల్, మార్చి 23: ఖిలావరంగల్ మధ్యకోటను వియత్నాం దేశస్థులు శనివారం తిలకించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వివిధ ప్రభుత్వ సంస్థల మీడియాలో పనిచేస్తున్న 26 మంది వియత్నాం దేశస్థులు స్టడీ టూర్‌లో భాగంగా కోటను సందర్శించారు. కీర్తితోరణాలు, శిల్పాల ఆవరణలోని అద్భుతకళా ఖండాలు, శిల్ప సంపదలు, ఏకశిలగుట్ట, గుండుచెరువు, ఖుష్‌మహల్, సింగారపుబావి, తదితర కట్టడాలు, స్వయంభూ-శంభులింగేశ్వస్వామి దేవాలయాలు, రాతి, మట్టికోటలను వారు ఆసక్తిగా తిలకించారు. తమ వెంట తెచ్చుకున్న కెమెరాలలో అద్భుత కట్టడాలు, శిల్పసౌందర్యాలను క్లిక్ మనిపించుకున్నారు. వారి వెంట ఎంసీబీహెచ్, ఆర్‌డీ ఫ్యాకల్టీ డాక్టర్ కె.సురేష్ కుమార్, శ్రీనివాస్, డీపీఆర్‌ఓ ఆయూబ్‌అలీ, వరంగల్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ కుమారస్వామి, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్ఐ గోవర్ధన్ పాల్గొన్నారు.



ఖిలావరంగల్ మధ్యకోటలోని కీర్తితోరణం వద్ద వియత్నాం దేశస్థులు

'కేంద్ర అప్రజాస్వామిక విధానాలను ఖండించాలి'



కరీమాబాద్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఏకశిలానగర్, మార్చి 23 : కేంద్రం నిఠి అప్రజాస్వామిక విధానాలను ప్రజాసంఘాలు ఖండించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. కేంద్ర విధానాలను ఖండిస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముక్కెర రామస్వామి అధ్యక్షతన కరీమాబాద్ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాగయ్య మాట్లాడుతూ ఈడీ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామిక గొంతుకలను నొక్కుతున్న మోదీని ప్రజలే గద్దె దించుతారన్నారు. 400 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికే మోదీ దేశానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, నలిగంటి రత్నమాల, సింగారపు బాబు, ఎం.సాగర్, ఎ.కుమార్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, దివ్య, పెంటయ్య , జుబేదా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వనజ దంపతులను సన్మానిస్తున్న మహిళలు

సంగెం, మార్చి 23: మహిళలు అన్ని రంగాల్లో రానించాలని సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. గవిచర్లలో శనివారం స్వజన వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. హనుమకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వేలూరి వనజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కల్పిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. వనజ మాట్లాడుతూ గవిచర్ల గ్రామాన్ని లయన్స్ క్లబ్ దత్తత తీసుకొని మహిళలకు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, వేలూరి శారత, లక్ష్మీనరిసంహారావు, కేయూ ప్రొఫెసర్ వేలూరి శ్రీదేవి, శ్యామల, శర్వాణి, లయన్స్ క్లబ్ కోశాధికారి శశికల, మాజీ ఎంపీపీ దొనికెన మల్లయ్య, మాజీ సర్పంచులు తొనికెల రమశ్రీనివాస్ పాల్గొన్నారు.

సీకేఎంలో గ్రేడ్-1 ఫార్మసిస్ట్‌గా సూరయ్య



గిర్మాజిపేట, మార్చి23 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి గ్రేడ్-1 ఫార్మసిస్ట్‌గా సన్నపు సూరయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. 15న జరిగిన పదోన్నతుల్లో నెక్కొండ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రేడ్-2 ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న సూరయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రి ఇన్‌చార్జి ఫార్మసిస్ట్‌గా ఉన్న ఉర్సు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి గ్రేడ్-2 ఫార్మసిస్ట్ ఎస్.ప్రకాశరావు నుంచి సూరయ్య బాధ్యతలు స్వీకరించారు. సీకేఎం ఆస్పత్రి గ్రేడ్-1 ఫార్మసిస్ట్ పద్మావతి పదోన్నతిపై 2021 ఫిబ్రవరిలో ఎంజీఎం ఫార్మసి సూపర్‌వైజర్‌గా వెళ్లడంతో అప్పటి నుంచి పోస్టుఖాళీగా ఉంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలకుమారి సీకేఎంకు అనుబంధంగా పనిచేస్తున్న ఉర్సు ఆస్పత్రి గ్రేడ్-2 ఫార్మసిస్ట్ ప్రకాశరావుకు డిప్యూటేషన్‌పై బాధ్యతలు అప్పగించారు.

విధుల్లో చేరిన సీనియర్ నర్సింగ్ అధికారులు

సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సీనియర్ నర్సింగ్ అధికారులు (హెడ్‌నర్సు)గా ఎల్.మంజుల రాణి, జి.వసంతలీలలు విధుల్లో చేరారు. సీనియర్ నర్సింగ్ అధికారులుగా పనిచేస్తున్న బి.ఎస్.రత్నకుమారి, కె.నారాయణమ్మలు ఆగస్టులో పదోన్నతిపై నర్సింగ్ గ్రేడ్-2 సూపరింటెండెంట్‌లుగా వెళ్లిపోయారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ రెండు స్థానాల్లో ఇటీవల జరిగిన నర్సింగ్ అధికారుల పదోన్నతుల్లో హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నర్సింగ్ అధికారి ఎల్.మంజుల రాణి, ఖమ్మం జిల్లా మధిర కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నర్సింగ్ అధికారి జి.వసంతలీల నియమితులయ్యారు.

ప్రభుత్వ ఔషధాలపై నిర్లక్ష్యం

వరంగల్ మెడికల్, మార్చి 23: తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) కేంద్ర ఔషధ గిడ్డంగి వరంగల్ (సెంట్రల్ మెడికల్ స్టోర్ వరంగల్) నుంచి ఉత్తర తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రులకు మెడిసిన్ సంస్థలో కీలకపాత్ర వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎంజీఎం ఆస్పత్రి నుంచి ఏరియా ఆస్పత్రులకు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వరకు ఇక్క డి నుంచే మందులు సరఫరా అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన ఔషధాలు అందించడమే లక్ష్యం గా కోట్ల రూపాయల నిధులు కేటాయించి సరఫరా చేస్తే (టీఎస్ఎంఎస్ఐడీసీ) వరంగల్ కార్యాలయంలో వారం రోజుల నుంచి ఎలాంటి భద్రతా లేకుండా ఇలా దర్శనమిచ్చాయి. కోట్ల రూపాయల విలువజేసే ఔషధాలను దుర్వినియోగం అయ్యేలా నిర్లక్ష్యం వహించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు

బాలికపై అత్యాచార యత్నం కేసులో పోక్సో కేసు నమోదు



వరంగల్ క్రైం, మార్చి23: బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడి పోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం సీఐ బండారి సంపత్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కేయూ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పరిచయమైన మహిళతో సంపత్‌కుమార్ సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళకు మైనర్ కూతురు ఉంది. మహిళతో సహజీవనం చేస్తున్న సంపత్‌కుమార్ కన్ను బాలికపై పడింది. ఇటీవల సీఐ సంపత్‌కుమార్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కూతురు ద్వారా తెలుసుకున్న మహిళ.. కేయూ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. శాఖాపరమైన చర్యలో భాగంగా ఐజీ రంగనాథ్ సీఐ సంపత్‌ను సస్పెండ్ చేశారు.

చెక్ పోస్టును తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి 23: రాయపర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టాపురం చెక్‌పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేసిన కమిషనర్ పోలీసుల తనిఖీ తీరును పరిశీలించారు. చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ అధికారులకు సూచించారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

దుగ్గొండి, మార్చి 23 : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన దుగ్గొండి మండలంలోని మైసంపల్లిలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన అకునూరి రవి, రమ దంపతుల కుమార్తె సుప్రియ (28)కు దుగ్గొండి మండలంలోని మైసంపల్లి గ్రామంలోని వెంగళ సారయ్య, సుభద్ర కుమారుడు కిరణ్‌తో 2016లో వివాహం జరిగింది. సుప్రియకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుప్రియ భర్త కిరణ్ సెల్ సెంటర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, శనివారం భర్త ఉద్యోగానికి వెళ్లాడు. పిల్లలు ఇద్దరు నల్లబెల్లిలోని ప్రైవేట్ పాఠశాలకు బస్సులో వెళ్లారు. ఇంటిలో సుప్రియ ఒకత్తే ఉంది. ఇల్లు ఊరుకు చివరన ఉంటుంది. బడికివెళ్లిన పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, ఇంటిలో తల్లి చనిపోయి ఉంది. అమ్మ అని ఎంత పిలిచినా పలుకక పోవడంతో, పిల్లలు కేకలు వేశారు. గ్రామస్థులు వచ్చి చూడగా మంచంపై సుప్రియ విగత జీవిగా ఉన్నది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుప్రియ ముఖం, శరీరంపై కాట్లు ఉన్నాయి. సుప్రియ చెవులకు ఉన్న బంగారం కమ్మలు, పుస్తేలు తాడు (మంగళ సూత్రం) ఎత్తుకొని పోయాడు. ఇంటిలో బీరువా పగుల కొట్టినట్లు ఉన్నది. దీంతో గుర్తు తెలియని వ్యక్తికి చోరీకి రావడతో అతనితో సుప్రియ గోడవ పడడం తోనే ఆమెను కొట్టి దిండుతో మెడపై ఉంచి చంపారని గ్రామస్థులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. సంఘటన స్థలానికి ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రాజగోపాల్, ఎస్సై పరమేశ్‌లు చేరుకొని డ్వాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మహిళ
సుప్రియ (ఫైల్)



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 24 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పశువుల కాపరి మృతి

ఖానాపురం, మార్చి 23 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పశువుల కాపరి శనివారం మృతి చెందాడు. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం... బుధరావుపేట శివారు సంగెంకాలువ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం లారీ ఢీకొనడంతో ఇదే గ్రామానికి చెందిన పశువుల కాపరి యాపశెట్టి నాగులు(30) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నాగులు మృతదేహం

అనుమానాస్పదంగా వివాహిత మృతి

దుగ్గొండి, మార్చి 23 : అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన దుగ్గొండి మండ లంలోని మైసంపల్లిలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన ఆకునూరి రవి, రమ దంపతుల కుమార్తె సుప్రియ(28)కు దుగ్గొండి మండలంలోని మైసంపల్లి గ్రామంలోని వెంగళ సారయ్య, సుభద్ర కుమారుడు కిరణ్‌తో 2016లో వివాహం జరిగింది. సుప్రియకు కుమార్తె , కుమారుడు ఉన్నారు. సుప్రియ భర్త కిరణ్ సెల్ సెంటర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తు న్నాడు. కాగా, శనివారం భర్త ఉద్యోగానికి వెళ్లాడు. పిల్లలు ఇద్దరు నల్లబెల్లిలోని ప్రైవేట్ పాఠశాలకు బస్సులో వెళ్లారు. ఇంటిలో సుప్రియ ఒకత్తే ఉంది. ఇల్లు ఊరుకు చివరన ఉంటుంది. బడికివెళ్లిన పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, ఇంటిలో తల్లి చనిపోయి ఉంది. అమ్మ అని ఎంత పిలిచినా పలుకక పోవడంతో, పిల్లలు కేకలు వేశారు. గ్రామస్థులు వచ్చి చూడగా మంచంపై సుప్రియ విగతజీవిగా ఉన్నది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుప్రియ ముఖం, శరీరంపై కాట్లు ఉన్నాయి. సుప్రియ చెవులకు ఉన్న బంగారం కమ్మలు, పుస్తేలు తాడు (మంగళ సూత్రం) ఎత్తుకొని పోయాడు. ఇంటిలో బీరువా పగుల కొట్టినట్లు ఉన్నది. దీంతో గుర్తు తెలియని వ్యక్తికి చోరీకి రావడతో అతనితో సుప్రియ గొడవ పడడంతోనే ఆమెను కొట్టి దిండుతో మెడపై ఉంచి చంపారని గ్రామస్థులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. సంఘటన స్థలానికి ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రాజగోపాల్, ఎస్సై పరమేశ్‌లు చేరుకొని డ్వాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టి, దర్యాప్తు చేస్తున్నారు.



సుప్రియ మృతదేహం (ఇన్‌సెట్‌లో) సుప్రియ (ఫైల్)

నెక్కొండ సంతకు మూడోసారి వేలం పాటలు

నెక్కొండ, మార్చి 23 : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతకు శనివారం అధికారులు మూడోసారి వేలం పాటలను నిర్వహించగా, ప్రభుత్వ నిర్ణీత ధర రాకపోవడంతో వేలం పాటలు దుబారా అయినట్లు అధికారులు ప్రకటించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం పాటలను నిర్వహించగా, గొర్రెలు, మేకలు, పశువుల రహదారి వేలం పాటలో కాంట్రాక్టర్ రావుల హరీష్‌రెడ్డి రూ.15.51లక్షలు, తైబజారు రహదారికి రూ.1.90లక్షలకు పాట పాడారు. అంతకు మించి వేలం పాటలు ముందుకు సాగలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలం పాటలు దుబారా అయినట్లు అధికారులు చెప్పారు. తదుపరి చర్యలకుగాను జిల్లా పంచాయతీ అధికారులకు వేలం పాటలకు సంబంధించిన నివేదికలను పంపించామని కార్యదర్శి డి.సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ ఇన్‌చార్జి ఎంపీవో సునీల్‌రాజ్, కాంట్రాక్టర్లు చల్లా పాపిరెడ్డి, తోట సాంబయ్య, సుదర్శన్, వెల్పుల కుమార్, కేవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల జాతరకు నాయకులు సహకరించాలి

దుగ్గొండి, మార్చి 23 : కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఏసీపీ కిరణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడారు. ప్రభబండ్లను రాజకీయాలకు అతీతంగా జాతరకు తరలించాలని, ఏలాంటి ఘర్షణలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిస్థాయిలో పోలీసులకు సహకరించాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిఘా విభాగం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, సీపీఎం నాయకుడు చల్లా గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలిలు మాట్లాడుతూ రాజకీయ ఘర్షణలకు పోకుండా జాతరకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి సీఐ రాజగోపాల్, నర్సంపేట సీఐ రమణమూర్తి, నెక్కొండ సీఐ చంద్రమోహన్, ఎస్సైలు జక్కుల పరమేష్, రఘుపతి, గాదె అరుణ్‌కుమార్, రామారావు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌కు ఎంపికైన మణిచందన



నెక్కొండ, మార్చి 23 : తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పలకల మణిచందన జాతీయస్థాయి బేస్‌బాల్ క్రీడకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చింత రవీందర్ శనివారం తెలిపారు. మణిచందన ఇటీవల జరిగిన జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ పంజాబ్ రాష్ట్రంలో జరిగే బేస్‌బాల్ క్రీడలో పాల్గొంటుందన్నారు. మణిచందనను గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి, మార్చి 23 : మండలంలోని కేశవాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 18వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ వ్యవస్థాపకుడు కంది జితేందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పూలమ్మలు శనివారం వెల్లడించారు. ప్రతీ ఏడాదిలాగానే ఉత్సవాలను వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. 24న అంకురార్పణ, యాగశాల ప్రవేశము, 25న ధ్వజకుంభ, ఆరాధన, మహాకుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, శేషవాహన సేవా 26న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 27న మహాపూర్ణాహుతి, నవకలశ, అభిషేకం, చక్రస్నానము నిర్వహిస్తామని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వహకులు వెల్లడించారు.

గుడిసెలను తగులబెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట, మార్చి 23 : నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలకు నిప్పుపెట్టి తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులను సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించి చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు తడుగుల విజయ్, ప్రజాదండోరా జాతీయ అధ్యక్షుడు అంది రవి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో కాలిపోయిన గుడిసెలను శనివారం సందర్శించారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఎస్‌పి, డిబిఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్‌రోడ్ సమీపంలోని 813 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో 2021లో పేదలతో గుడిసెలు వేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలు గుడిసెలు వేసుకొని గత మూడేళ్ళుగా జీవనం కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 8.45 గంటల ప్రాంతంలో లుంగీ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి సంచరించి గుడిసెలకు నిప్పుపెట్టి పరారయ్యాడని తెలిపారు. అదే రాత్రి 100 డయల్ చేసి సమాచారం అందించామన్నారు. వారిచ్చిన సూచన మేరకు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గుడిసెలను తగులబెట్టిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డి బీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జలగం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కాలిన గుడిసెలను పరిశీలిస్తున్న నాయకులు

ఘనంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : పట్టణంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగర గారి ప్రీతమ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ప్రీతమ్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జ రవీందర్‌రెడ్డి, గబ్బెట బాబు, మధుకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

నర్సంపేట, మార్చి 23 : భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ డివిజన్ ప్రధానకార్యదర్శి గుర్రం అజమ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశంలో రోజురోజుకు మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆకుల వెంకటస్వామి, సుమన్, అభి, పీడీఎస్‌యూ డివిజన్ కోశాధికారి రవి, సారంగపాణి, అశోక్, అనిల్ పాల్గొన్నారు. అలాగే నర్సంపేట పట్టణంలోని మార్క్స్‌కాలనీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ), ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జన్ను జమున, గణిపాక బిందు, గోనెల అనిత, గుజ్జుల ప్రియాంక, వెన్నెల, అరుణ, పద్మ, చాందని, జయ, కోమల, పిట్టలపద్మ, కోమల పాల్గొన్నారు.

• ఖానాపురం : భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రైతు సంఘం అశోక్‌నగర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో నిర్వహించిన సభలో నాగరాజు మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగంచేసిన వీరుడు భగత్‌సింగ్ అన్నారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు, సాయిలు, రాములు, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు. అలాగే ధర్మరావుపేటలో భగత్ యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్ యూత్ అధ్యక్షుడు కోరె సుధాకర్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భగత్ యూత్ కార్యదర్శి రమేష్, వెంకటేశ్వరరావు, దేవేందర్‌రావు, కరుణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ: భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలనే అర్పించిన అమరవీరుడు భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికి నేటి యువత ముందుడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు పిలుపునిచ్చారు. శనివారం నెక్కొండలో పనికర గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ యవ్వనంలోనే స్వాంతంత్ర్య పోరాటాల్లో పాల్గొని యువతకు ఆదర్శగానిలిచి వారిలో స్ఫూర్తిని నింపి ఉద్యమాన్ని ఉధృతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిలకలపల్లి శ్రీనివాస్, నిరటి సుగుణమ్మ, ఎండీ అఫ్జల్‌పాషా, పిట్టల బుచ్చమ్మ, భిక్షపతి, చంద్రమ్మ, కనకమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని బల్వంతాపురంలో శని వారం ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లబోయిన రాజు మాట్లాడుతూ భగత్ సింగ్ దేశం కోసం ప్రాణాలు ఆర్పించారన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వివేక్, శివ పాల్గొన్నారు.

• పర్వతగిరి: భారతదేశ ముద్దుబిడ్డలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం మండలకేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, రైతుసంఘం జిల్లా కన్వీనర్ ఎన్నమనేని వెంకటేశ్వర్‌రావు, గీతకార్మిక సంక్షేమ సంఘం మండల కన్వీనర్ దొమ్మటి వీరస్వామి, శేషనాథ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులుర్పిస్తున్న ఏఐఎఫ్‌డీడబ్ల్యూ మహిళానాయకులు

జీతాలివ్వండి మహాప్రభో..!

మునిసిపల్ కార్యాలయం ఎదుట సిబ్బంది ధర్నా



మునిసిపాలిటీ ఎదుట ఆందోళనచేస్తున్న సఫాయిలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : వర్ధన్నపేట మునిసిపాలిటీ సిబ్బంది, సఫాయిలు రోడ్డెక్కారు. జీతాలివ్వండి మహాప్రభో అంటూ కార్యాలయం ఎదుట శనివారం ఉదయం ఆందోళన చేపట్టారు. జీతాలు లేక మూడు నెలలు కావొస్తుందని, ఎప్పుడు జీతాలిస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా సఫాయిలు పసునూరి రజిత, కొండేటి అనితలు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో బతుకులు వెల్లదీస్తున్నామని, కానీ, అవి కూడా సమయానికి ఇవ్వకపోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు ఊడుస్తూ, వీధులు శుభ్రం చేసే తమపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని కోరారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ ఈ నెలాఖరులోగా జీతాలు చెల్లించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రమ్మ, ఆనందం, కాంత, స్వరూప, రాధిక, కొమురమ్మ, ప్రేమలీలా, ప్రశాంతి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో పిచ్చి కుక్క స్వైరవిహారం

• ఐదుగురు చిన్నారులపై దాడి.. ఆస్పత్రికి తరలింపు

• మరో ఇద్దరు వ్యక్తులు, మూగజీవాలకు గాయాలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : తండాల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ కనపడిన ఐదుగురు చిన్నారులు, ఇద్దరు వ్యక్తులు, పలు మూగజీవాలపై దాడి చేసిన సంఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. తండావాసుల కథనం ప్రకారం... వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని నీలగిరి స్వామి తండా, డీసీ తండా, స్వామి తండాల్లో పిచ్చికుక్క ఒక్కసారిగా దాడికి పాల్పడింది. రోడ్లపై ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేస్తుండగా అడ్డొచ్చిన మరో ఇద్దరు వ్యక్తులపై కూడా దాడి చేసింది. తండావాసులు దానిని పట్టుకునే తరుణంలో పలు మూగజీవాలపై కూడా దాడిచేసి గాయాలపాలు చేసింది. ఎట్టకేలకు స్థానికులు కుక్కను పట్టుకుని అక్కడే చంపేశారు. అనంతరం గాయాలపాలైన చిన్నారులు పదమూడేళ్ల మాలోతు చరణ్, ఏడేళ్ల భూక్యా అభిరామ్, పదకొండేళ్ల నెతావత్ అరుణ్, పన్నెండేళ్ల బానోతు శశికాంత్, ఆరు సంవత్సరాల గుగులోతు దేవాన్స్‌లతో పాటు మరో ఇద్దరు నెతావత్ రాములు, భూక్యా టాన్యాలను వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బేతి నర్సింహస్వామి వెంటనే వారికి చికిత్స అందించి వ్యాక్సిన్ వేశారు. కుక్క దాడిలో బలమైన గాయాలు కావడం వలన మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రి నుంచి అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.



కుక్కకాటు బాధితులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్న వర్ధన్నపేట వైద్యులు

• కళ్ల ముందు చూస్తుండగానే..

మాలోతు మైబెల్లి, నీలగిరిస్వామి తండా



పిచ్చికుక్క కళ్ల ముందు చూస్తుండగానే చిన్నారులపై దాడి చేసింది. చిన్న పిల్లలు తీవ్రంగా గాయ పడ్డారు. నిలువరించేలోపే దాడి చేసి ఇతర చోట్లకు పారిపోయింది. మొత్తానికి పట్టుకుని చంపేశాం. లేకపోతే మరికొంత మందిపై దాడి చేసేది. తండాలో గొర్లు, మేకల కళేబరాలు ఎక్కువగా రోడ్లపై వేయడంతో కుక్కలు బాగా పెరిగిపోయాయి. మునిపాలిటీ అధికారులు కుక్కల బెడద నుంచి తండావాసులను కాపాడాలి.

వికటించిన గాలికుంటు వ్యాక్సినేషన్?

బర్రె మృతి.. కళేబరానికి పరీక్షలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : పశువులకు వేసే ఎఫ్అండ్ఎం(ఫూట్ అండ్ మౌత్) గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ వికటించడంతో బర్రె మృతిచెందిన సంఘటన మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామంలో పలు పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డాక్టర్ రాజేందర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా పలు పశువులకు వ్యాక్సినేషన్ వేయగా, అందులో ఆకులపెల్లి యాకయ్యకు చెందిన బర్రె వ్యాక్సిన్ వేసిన గంటలోనే మృతిచెందింది. దీంతో గాలికుంటు వ్యాక్సినేషన్ వికటించే చనిపోయిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెటర్నరీ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వరంగల్ జేడీ బాలకృష్ణ, వర్ధన్నపేట ఏడీ యాకూబ్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని వెటర్నరీ ల్యాబ్‌టెక్నిషియన్ ఆధ్వర్యంలో బర్రె కళేబరానికి పరీక్షలు చేసి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 50పశువుల వరకు ఇదే వ్యాక్సినేషన్ వేశామని, పెన్సిలిన్ పడకపోవడం వలన మృతిచెందినట్లుగా అనుమానం ఉందని తెలిపారు. కానీ, బాధితుల ఫిర్యాదు మేరకు కళేబరానికి పరీక్షలు చేసి శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామని మూడు రోజుల్లో రిపోర్ట్స్ వస్తాయని తెలిపారు. వ్యాక్సినేషన్ ఒక్కో బాటిల్ 100 ఎంఎల్ వరకు ఉంటుందని, ఒక్కో బర్రెకు 2 ఎంఎల్ చొప్పున వేస్తామని స్పష్టంచేశారు.



బర్రె కళేబరానికి పరీక్ష చేస్తున్న వెటర్నరీ వైద్యులు

పాఠశాలల్లో హోలీ సంబరాలు



హోలీ జరుపుకుంటున్న చిన్నారులు

నర్సంపేట, మార్చి 23 : పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎర్ర ఉర్మిళాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల కుంకుమలను చల్లుకొని హోలీ వేడుకను జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు. వైస్ ప్రిన్సిపాల్ ఆకాశ్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అక్షర పాఠశాలలో చిన్నారి బాలబాలికలు ఒకరికి ఒకరు రంగులు పూసుకొని హోలీ సంబరాలను సంతోషంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని బాలాజీ విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ఏవో సురేశ్, విద్యార్థులు, ఉపాధ్యాయాలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు తనిఖీ



డీసీతండా వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : వర్ధన్నపేట పట్టణ శివా రులోని డీసీతండా వద్ద ఏర్పాటు చేసిన స్టాటిస్టిక్ సర్వేలైన్స్ టీం చెక్‌పోస్టును శనివారం సాయంత్రం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వాహ నాల తనిఖీ తీరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమ లులో ఉన్నందుకు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఉండేందుకు పోలీసులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండలంలోని కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద చెక్ పోస్టును శనివారం సాయంత్రం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు సిబ్బంది నిర్వహిస్తున్న పని తీరును, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్ కుమార్, ఏఈ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలు కంప్యూటరీకరణ

దుగ్గొండి, మార్చి 23 : పొదుపు సంఘాల సభ్యుల వివరాలు, లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తామని సహవికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద అన్నారు. మండల కేంద్రంలో శనివారం పొదుపు సమితి 11వ వార్షిక మహాసభ సమితి అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జయప్రద మాట్లాడుతూ పొదుపు సమితిలో 10 పొదుపు సంఘాలు ఉన్నాయని మ్యాక్స్ చట్టం కింద సేవలు అందిస్తామన్నారు. పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలను కంప్యూటరీకరణ చేసి భద్రత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ధర్మవతి, ఉపాధ్యక్షుడు కందికొండ రవీందర్, సభ్యులు కందుల శ్రీనివాస్, గంగిడి రాజిరెడ్డి లింగమూర్తి, మహేంద ర్‌రెడ్డి, సత్యనారాణరెడ్డి, ముదురకోల నర్సయ్య, రమేశ్, బాబురావు, గణకులు రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



పొదుపు సమితి వార్షిక సభలో మాట్లాడుతున్న జయప్రద

అనుమతులు లేకుండా ఇసుకను తరలించొద్దు

వర్ధన్నపేట రూరల్, మార్చి 23 : ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని ఆకేరు వాగులో అక్రమంగా ఇసుకను తోడి తీసుకెళ్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆకేరు వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో సీజ్ చేసిన ట్రాక్టర్లను చూపుతున్న ఎస్ఐ

సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు

బాలికపై అత్యాచారయత్నం కేసులో పోక్సో కేసు



వరంగల్ క్రైం, మార్చి 23 : బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడి పోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం సీఐ బండారి సంపత్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కేయూ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పరిచయమైన మహిళతో సంపత్‌కుమార్ సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళకు మైనర్ కూతురు ఉంది. మహిళతో సహజీవనం చేస్తున్న సంపత్ కుమార్ కన్ను బాలికపై పడింది. ఇటీవల సీఐ సంపత్‌కుమార్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కూతురు ద్వారా తెలుసుకున్న మహిళ.. కేయూ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. శాఖాపరమైన చర్యలో భాగంగా ఐజీ రంగనాథ్ సీఐ సంపత్‌ను సస్పెండ్ చేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన అనిల్‌రావు

పర్వతగిరి, మార్చి 23 : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను శనివారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిస్నింటి అనిల్‌రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై వినతిపత్రాన్ని అందించారు. ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చినట్లు అనీల్‌రావు తెలిపారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందిస్తున్న అనిల్‌రావు

రుణాలు సకాలంలో చెల్లించాలి

రాయపర్తి, మార్చి 23 : మహిళా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభ్యున్నతికి పాటుపడాలని శ్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం, గట్టికల్లు గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలు పడిన మహిళా సంఘం సభ్యులు వెంటనే రుణాలు చెల్లించాలని కోరారు. రుణాలు అందించి మరింత రుణం తీసుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్ కుమార్, వీవోఏ మంగమ్మ, సంధ్య, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకన్న (ఫైల్)

పర్వతగిరి, మార్చి 23 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముంజాలకుంట తండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన రమావత్ వెంకన్న(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో నూతనంగా నిర్మించే ఇంటికి నీటి వసతి కోసం శనివారం బోరుకు కరెంటు మోటారును బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రమావత్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున సహాయం అందేలా కృషిచేస్తామన్నారు. పరామర్శించిన వారిలో బానోత్ రవి, బానోత్ తిరుపతి, ముదురకోల రమేష్, నీలం శ్రీనివాస్, దండెపల్లి సైదులు, జేతురాం, యాకయ్య, ప్రసాద్, వడ్లకొండ రమేష్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ రైతు...



మల్లయ్య (ఫైల్)

పర్వతగిరి, మార్చి 23 : పాము కాటుకు గురై చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అక్కల మల్లయ్య(55) ఐదు రోజుల క్రితం తన పంటపొలానికి సాగునీరు పారిస్తుండగా పాముకాటు వేసింది. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య మణెమ్మ, ఇద్దరు కుమారులు వినయ్, నాగేష్ ఉన్నారు. మృతుని భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పది పరీక్ష కేంద్రాల సందర్శన

పర్వతగిరి, మార్చి 23 : పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి శనివారం సందర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లాపరిషత్, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలను సందర్శించి పరీక్షల తీరును, కేంద్రాల్లోని ఏర్పాట్లను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలని ఇన్విజిలెటర్లకు సూచించినట్లు పరీక్షల చీఫ్ సూపరిటెండెంట్ పాక రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న మహిళ అరెస్టు

పర్వతగిరి, మార్చి 23 : గుడుంబా తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. నెక్కొండ మండలంలోని మహబూబ్ నాయక్ తండాకు చెందిన బానోత్ శ్రీలత మండల కేంద్రంలో గుడుంబా విక్రయించేందుకు వెళ్తుండగా, పోలీసులు అనుమానంతో తనిఖీ చేయగా 8 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడిగంట చోరీ

నెక్కొండ, మార్చి 23 : నెక్కొండ మండల కేంద్రంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం అవరణలో ఉన్న గుడిగంట శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ గంట విలువ దాదాపు రూ. ఏడు వేలు ఉంటుందని ఆలయ చైర్మన్ ఎర్రబెల్లి సంపత్‌రావు తెలిపారు. ఇటీవలి కాలంలో ఈ దేవాలయంలో గంటలు చోరీకి పాల్పడడం ఇది రెండో సారి అని అన్నారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చైర్మన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.